సాక్షి శ్రీకాకుళం

ఆదివారం । 22 । డిసెంబర్ । 2024



నలుగురికి తీవ్ర గాయాలు

పాతపట్నం ఎమ్మెల్యే తనయుడి వాహనం ఆటోను ఢీకొట్టింది. నలుగురు గాయపడ్డారు.

- 8లో



కత్తులతో బెదిరించి..

జిల్లా కేంద్రంలో ఓ వ్యాపారి ఇంటిలోకి దుండగులు చొరబడ్డారు. కత్తులతో బెదిరించారు.

- 8లో

బీపీఈడీ, డీపీఈడీ రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: బీఆర్ఏయూలో శనివారం బీపీఈడీ, డీపీఈడీ రెండో సెమిస్టర్ ఫలితాలను పోస్టు గ్రాడ్యుయేషన్ ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ శనివారం విడుదల చేశారు. బీపీఈడీలో రెండో సెమిస్టర్ 282 మంది రాయగా, 279 మంది ఉత్తీర్ణత సాధించారు. డీపీఈడీ రెండో సెమిస్టర్ 46 మంది రాయగా, 46 మంది ఉత్తీర్ణత సాధించారు.



కొత్తూరులో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



కాశీబుగ్గ: పలాసలో కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



జిల్లా కేంద్రంలోని దుర్గాదేవి ఆలయంలో హోమం చేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, తూర్పుకాపు, కళింగవైశ్య కుల రాష్ట్ర అధ్యక్షులు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిల్లి వెంకటసత్యనారాయణ, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎంవీ పద్మావతి, ఎన్ని ధనుంజయ్ తదితరులు

అధినేతపై అభిమానం

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలను పార్టీ నేతలు శనివారం ఘనంగా నిర్వహించారు. రక్తదానాలు, వస్త్రదానాలు వంటి సేవా కార్యక్రమాలతో ఊరూరా హోరెత్తించారు. ఆలయాల్లో పూజలు, హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించి నాయకుడిపై అభిమానాన్ని చాటుకున్నారు. వైఎస్ జగన్ చేసిన మంచిని మరోమారు అందరికీ గుర్తు చేశారు. ప్రతి అడుగులోనూ అధినేతకు తోడుగా ఉంటామని చెప్పారు.



ఇచ్ఛాపురంలోని స్వేచ్ఛావతి అమ్మవారికి పూజలు చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు



పొందూరు: పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిల్లి వెంకటసత్యనారాయణ, కళింగ కుల రాష్ట్ర అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు



నరసన్నపేట: పేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న ధర్మాన కృష్ణదాస్ తదితరులు



ఆమదాలవలస: లెప్రసీ కాలనీ వాసులకు దుస్తులు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్



టెక్కలి: రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ టెక్కలి సమన్వయకర్త పేరాడ తిలక్, నాయకులు



రణస్థలం: పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



టెక్కలి: ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఇంటి వద్ద పుట్టినరోజు వేడుకలు

న్యూస్‌రీల్

పీజీ రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో పోస్టు గ్రాడ్యుయేషన్ రెండో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను పీజీ ఎగ్జామినేషన్స్ డీన్ ఎస్.ఉదయ్‌భాస్కర్ శనివారం విడుదల చేశారు. ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో, జ్ఞాన భూమి పోర్టల్‌లో అందుబాటులో ఉంచారు. 19 పీజీ కోర్సుల్లో విద్యార్థులు పరీక్ష రాశారు. సబ్జెక్టుల వారీగా పరిశీలిస్తే జర్నలిజం మాస్ కమ్యూనికేషన్‌లో 3కు 3, ఎకనామిక్స్‌లో 9 మందికి 9, ఇంగ్లిష్‌లో 19 మందికి 19, రూరల్ డెవలప్‌మెంట్‌లో 4కు 4, సోషల్ వర్కులో 3 మందికి 3, తెలుగులో 6 మందికి 6, ఎంబీఏలో 40 మందికి 40, ఎంకాంలో 8 మందికి 8, ఎంఈడీలో 27 మందికి 27, ఎంఎల్ఎస్సీలో 15 మందికి 15, ఎనలిటికల్ కెమిస్ట్రీలో 38 మందికి 35, బయోటెక్నాలజీలో 25 మందికి 25, ఫిజిక్స్‌లో 13 మందికి 12, ఆర్గానిక్ కెమిస్ట్రీలో 187 మందికి 132, గణితంలో 15 మందికి 14, జువాలజీలో 7 మందికి 7, మైక్రోబయోలజీలో 20 మందికి 18, కంప్యూటర్ సైన్స్‌లో 23 మందికి 17, అప్లైడ్ మ్యాథ్స్‌లో 7 మందికి ఆరుగురు ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 469 మంది పరీక్ష రాయగా, 400 మంది ఉత్తీర్ణత సాధించారు. 15 రోజుల్లోగా రీవాల్యుయేషన్‌కు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎండీఎంకు పక్కాగా ఏర్పాట్లు చేసుకోవాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో జనవరి ఒకటోతేదీ నుంచి రాష్ట్రప్రభుత్వం నిర్వహించనున్న మధ్యాహ్న భోజన పథకం అమలుకు ఏర్పాట్లు పకడ్బందీగా చేసుకోవాలని ఇంటర్ విద్య డీవీఈఓ శివ్వాల తవిటినాయుడు పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల ప్రిన్సిపాళ్లు, కాలేజీలతో ట్యాగ్‌అయిన ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కళాశాలల ప్రిన్సిపాళ్లు హెచ్‌ఎంలతో సమన్వయం చేసుకుని పథకాన్ని పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐఓ ప్రగడ దుర్గారావు, బి.శ్యామ్ సుందర్, ఎం.కృష్ణవేణి, పీవీఎల్ నారాయణ, కీర్తి తవిటినాయుడు, ప్రిన్సిపాళ్లు, హెచ్‌ఎంలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆడితే ఆడాలిలా..



పేదింటి పిల్లలు అడ్డుగోడలు బద్దలుగొడుతున్నారు. ఆటలోకి దిగడం ఆలస్యం.. పతకాల వేట సాగిస్తున్నారు. ఓ వైపు చదువుకుంటూనే రాష్ట్ర జాతీయ స్థాయి పోటీల్లో అదరగొడుతున్నారు. ముఖ్యంగా కబడ్డీలో మన వారి కూత ఎదుటివారికి దడ పుట్టిస్తోంది. అంతే కాదు.. నెట్ బాల్, ట్రయాథ్లాన్, జావెలిన్‌త్రోలోనూ రాణిస్తున్నారు. సౌత్‌జోన్ స్టేట్ మీట్, అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెలక్షన్స్‌లో మన జిల్లా నుంచి దాదాపు 80 మంది వరకు సత్తా చాటారు. నేపథ్యాలు సామాన్యమైనవే అయినా వీరి విజయాలు అసామాన్యంగా కనిపిస్తున్నాయి.

- వజ్రపుకొత్తూరు

- అథ్లెటిక్స్‌లో అదరగొడుతున్న పేదింటి పిల్లలు
- పతకాల వేట సాగిస్తున్న సిక్కోలు యువత
- రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో మెరుస్తున్న గోవిందపురం క్రీడాకారులు



జావెలిన్ విసురుతున్న క్రీడాకారుడు

ప్రతిభకు కేరాఫ్ గోవిందపురం

- గోవిందపురం ఉన్నత పాఠశాల క్రీడాకారులు చక్కటి విజయాలు సాధిస్తున్నారు. దీని వెనుక పీడీ నడిమింటి నాగరాజు కృషి ఎంతో ఉంది. హెచ్‌ఎం కె.హరిబాబు సైతం ఫిజికల్ డైరెక్టర్ కావడం ఇక్కడ విద్యార్థులకు వరం.
- గిన్ని లింగప్రధాన్ షాట్‌పుట్, జావెలిన్ త్రో విభాగాల్లో 2022, 2023, 2024లలో గుంటూరు, ఏలూరులలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటాడు.



బతకల జస్వంత్

- స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన అండర్ -14 విభాగంలో ఎం.ఢిల్లేశ్వరి, పి.గిరిజ తణుకు, భీమవరంలో జరిగిన రోప్ స్కిప్పింగ్‌లో పతకాలు సాధించారు.
- బతకల జస్వంత్, హర్షవర్ధన్ ఈ ఏడాది గుంటూరులో జరిగిన 200 మీటర్ల పరుగు పందెం, భీమవరంలో జరిగిన రోప్ స్కిప్పింగ్ ఆటల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు.
- పలాస ఉన్నత పాఠశాలలో చదువుతున్న బడే తిరుమల ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో ఈ నెల 21 నుంచి జరుగుతున్న జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యాడు.

జాతీయ స్థాయిలో ఆడాలన్నదే లక్ష్యం



జాతీయస్థాయిలో ఆడాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. ఆ దిశగా మా పీడీ సార్ నాగరాజు తీర్చిదిద్దుతున్నారు. చదువుపై కూడా దృష్టి సారిస్తున్నాను. జావెలిన్ త్రోలో సైతం శిక్షణ పొందుతున్నాను.

- గిన్ని లింగప్రదాన్, విద్యార్థి, గోవిందపురం ఉన్నత పాఠశాల

కూత అదరహో..



దట్టి కళ్యాణ్

నందిగాం మండలం మర్లపాడు గ్రామానికి చెందిన దట్టి కళ్యాణ్ పూండి–గోవిందపురం ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. విద్యార్థి తల్లి దండ్రులు పూర్ణ సీతారామయ్య వ్యవసాయ కూలీలు. పాఠశాల హెచ్‌ఎం కె.హరిబాబు, వ్యా యామ ఉపాధ్యాయుడు ఎస్.నాగరాజు ప్రోత్సాహంతో విద్యార్థి కబడ్డీలో సాధన చేశాడు. నవంబర్ 9న బాపట్లలో జరిగిన 68వ రాష్ట్ర స్థాయి అండర్-14 కబడ్డీ పోటీల్లో జట్టును అజేయంగా నిలిపాడు. ప్రభుత్వ ఉద్యోగంలో స్థిరపడి గ్రామానికి, తల్లిదండ్రులకు సేవ చేస్తానని చెబుతున్నాడు.

గర్వపడే క్రీడాకారులు కావాలన్నదే నా తపన



నేను శిక్షణ ఇచ్చిన విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పాల్గొని దేశం గర్వపడే మంచి క్రీడాకారులుగా ఎదగాలన్నదే నా తపన. మా గోవిందపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇండియన్ ఆర్మీ, నేవీ, స్పోర్ట్స్ ఫిజియో వంటి ప్రభుత్వ ఉద్యోగాల్లో సెటిలయ్యారు.

- నడిమింది నాగరాజు, ఫిజికల్ డైరెక్టర్, గోవిందపురం ఉన్నత పాఠశాల

రోప్ స్కిప్పింగ్ అంటే ఇష్టం



ఎలిమెంటరీ పాఠశాల నుంచే నాకు రోప్ స్కిప్పింగ్ అంటే చాలా ఇష్టం. అక్కడే బాగా నేర్చుకున్నాను. ఉన్నత పాఠశాలకు వచ్చాక మా పీడీ సార్ నాగరాజు నాకు మరిన్ని మెలకువలు నేర్పించారు.

- ఎం.ఢిల్లేశ్వరి, విద్యార్థిని, గోవిందపురం ఉన్నత పాఠశాల

జావెలిన్ విసిరితే జయమే..



చింత హరిత

వజ్రపుకొత్తూరు మండలం తోటపల్లి గ్రామానికి చెందిన చింత హరిత గోవిందపురం జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. తల్లిదండ్రులు మాధవరావు, భాగ్యవతి వ్యవసాయదారులు. జావెలిన్ త్రోలో ఈమె అద్భుతంగా రాణిస్తోంది. 2023లో నరసారావుపేటలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారు నిర్వహించిన స్టేట్ మీట్‌లో రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచింది. 2024లో అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన సౌత్ జోన్ స్టేట్ మీట్‌లో రజతం సాధించింది. ఉపాధ్యాయురాలిగా నిలవాలన్నది హరిత ఆకాంక్ష.

హేమర్ త్రోలో చిచ్చర పిడుగు



కీలు ధనుంజయ

వజ్రపుకొత్తూరు మండలం ఉద్దానం కూర్మనాథపురానికి చెందిన కీలు ధనుంజయ తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలుగా పని చేస్తూ కుమారుడిని గోవిందపురం ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివిస్తున్నారు. ధనుంజయ హేమర్‌త్రోలోనే కాక డిస్క్ త్రో, షాట్‌పుట్ వంటి అథ్లెటిక్స్‌లో సైతం విశేషంగా రాణిస్తున్నాడు. 2024లో శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన హేమర్‌త్రో పోటీల్లో చక్కటి ప్రతిభ కనబరిచాడు. 2022, 2023, 2024లలో జోన్ స్థాయిలో జరిగిన పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాడు.

ఎన్నికల క్లెయిమ్స్‌పై సూపర్ చెక్



క్లెయిములు పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికల క్లెయిమ్స్‌పై సూపర్ చెక్ కార్యక్రమాన్ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం తన చాంబర్‌లో నిర్వహించారు. ఎస్ఎస్ఆర్ రూపకల్పనలో భాగంగా ఇప్పటివరకు వచ్చిన ఫారం 6, 7, 8 క్లెయిమ్స్‌కు సంబంధించి డిస్పోజ్ అయిన క్లెయిమ్స్‌లలో భారత ఎన్నికల కమిషన్ నుంచి వచ్చిన 23 దరఖాస్తులను కలెక్టర్ స్వయంగా సూపర్ చెక్ చేశారు. ఆయా క్లెయిమ్స్ కింద అర్జీ పెట్టుకున్న వారి ఇంటి వద్దకు బీఎల్ఓలు వెళ్లారా? లేదా? ఓటరు అందించిన సరైన వివరాలనే బీఎల్ఓ పొందుపరిచారా లేదా? తదితర అంశాలను పరిశీలించారు.

కొత్త డీఎంహెచ్‌ఓగా బాలమురళీకృష్ణ



అరసవల్లి: జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి (డీఎంహెచ్ఓ)గా డాక్టర్ టీవీ బాలమురళీ కృష్ణ నియమితులయ్యారు. ఈయన ఇంతవరకు కర్నూలు జిల్లా బడినెహల్ పీహెచ్‌సీలో విధులు నిర్వర్తించి పదోన్నతిపై స్థానిక జిల్లాకు కొత్త డీఎంహెచ్‌ఓగా రానున్నారు. ఇంతవరకు జిల్లాలో డీఎంహెచ్‌ఓగా విధులు నిర్వర్తించిన డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షికి విశాఖపట్నం ఆర్‌టీసీ (మేల్) ప్రిన్సిపాల్‌గా బదిలీ చేశారు. ఈ మేరకు స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటి కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే డాక్టర్ కె.అనితను ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సిఎస్ఆర్ఎంఓగా నియమించారు. ఇక పలాసలో కిడ్నీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో సిఎస్ఆర్ ఎంఓగా డాక్టర్ ఎం.శ్రీహరిబాబును నియమించారు. వీరు త్వరలో జిల్లాలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

విస్తారంగా వర్షాలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. శనివారం ఉదయానికి జిల్లా వ్యాప్తంగా 1311.6 మిల్లీమీటర్ల వర్షం కురవగా, ఉదయం నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు 226 మిల్లీమీటర్ల వర్షం పడింది. మొత్తం మీద 1537 మిల్లీమీటర్ల వాన పడింది.

వరుస విపత్తులు.. అన్నదాత కుదేలు

- చేతికొచ్చిన పంట వర్షార్పణం
- ధాన్యం సేకరణలో సర్కార్ విఫలం
- ఆలస్యంగా ప్రారంభమైన కొనుగోళ్లు
- కోసిన పంటను దాచుకోవడానికి టార్పాలిన్లు సైతం సకాలంలో సమకూర్చని దుస్థితి
- తడిచిన పంట, తేమ శాతం, దళారుల దోపిడీతో రైతులకు తప్పని నష్టం



ఇచ్ఛాపురం రూరల్: ధర్మపురంలో నీట మునిగిన వరి

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: వాతావరణం రైతులపై రణం ప్రకటించినట్టుంది. పంట చేతికొచ్చిన సమయంలో వరుస విపత్తులతో రైతుల కంట కన్నీరు పెట్టిస్తోంది. వదలని వర్షాలతో అన్నదాతకు మనశ్శాంతి కరువైంది. పట్టించుకోవాల్సిన పాలకులకు కనికరం లేదు. ప్రకృతి వైపరీత్యానికి దళారుల దోపిడీ తోడవడంతో రైతులు నిండా మునిగిపోయారు.

కష్టం వర్షార్పణం..

అన్నదాతల కష్టం వర్షార్పణమైంది. పొలాల్లో వరి పంట నేలకొరిగి కొందరు, పంట నూర్పిడి పూర్తి చేసుకుని అమ్ముకోవడానికి తీసుకొచ్చి ధాన్యం రాశులు తడిచి ముద్దయిపోయి మరికొందరు రైతులు రోదిస్తున్నారు. గత మూడు వారాలుగా కురుస్తున్న వర్షాలతో వరి తడిచి చేతికి రాని పరిస్థితి నెలకుంది. పొలాల్లో కోసి ఉంచిన వరి కుప్పలు తడిచిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. పొలంలో చేరిన నీటిని తొలగించడానికి నానా అవస్థలు పడుతున్నారు. కోసిన వరి మొదలు పొలం నుంచి తీసుకు వచ్చిన ధాన్యం రంగు మారడం, మొలకెత్తుతుండటంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. నవంబర్ నెలాఖరులో వచ్చిన ఫెంగల్ తుఫాన్ దగ్గరి నుంచి రైతులకు నిద్ర కరువైంది. ఒక అల్పపీడనం తప్పిందనే లోపు మరో అల్పపీడనం ముంచుకు రావడంతో రైతులకు కంటిమీద కునుకులేకుండాపోతోంది.

సర్కార్ విఫలం

వాతావరణ హెచ్చరికలు ఉన్నాయి. ఫెంగల్ తుఫాన్ దగ్గరి నుంచి వరుస అల్పపీడనాలు ఏర్పడుతున్నాయి. బాధ్యత గల ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోలు చేయాలి. కానీ ప్రభుత్వం ఆ పని చేయలేదు. డిసెంబర్ మొదటి వారం వరకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి. పోనీ ఆ తర్వాతైనా అప్రమత్తమై కొనుగోలు వేగవంతం చేసిందా అంటే అదీ చేయలేదు. ఇక రైతులకు ఎప్పటికప్పుడు కోతలు ఎప్పుడు చేయాలి, వరి కుప్పలను ఎలా భద్రపరుచుకోవాలి, ధాన్యం ఎలా దాచుకోవాలి తదితర సూచనలు చేయడమే కాకుండా వాటికి అవసరమైన టార్పాలిన్లు తదితరవి సమకూర్చాలి. కానీ కూటమి ప్రభుత్వం ఆ రకంగా చేయడంలో విఫలమైంది. కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభించి, ఎలా నిర్లక్ష్యంగా వహించిందో అదే రకంగా కోతలు పూర్తయిన వారికి పంటను దాచుకునేందుకు అవసరమైన టార్పాలిన్లు సమకూర్చలేకపోయింది. జిల్లాలో 5లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 3,38,000మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేసింది. ఇందులో కూడా మిల్లర్ల మాయాజాలం ఉందని ఆరోపణలు ఉన్నాయి.

కన్నీరు మున్నీరు..

ప్రభుత్వం సకాలంలో స్పందించకపోవడంతో కోసిన పంట పూర్తిగా నష్టపోకూడదని రైతులు దళారుల బారిన పడాల్సి వచ్చింది. దీంతో మద్దతు ధరను కోల్పోయారు. ఇలా ప్రైవేటు వ్యక్తులు కొనుగోలు చేసిన ధాన్యమే ప్రభుత్వం సేకరించిన లెక్కల్లో కలిసి ఉందన్న వాదనలు ఉన్నాయి. మరోవైపు తడిచిన ధాన్యం కొనుగోలు చేసేందుకు వెనుకంజ వేస్తున్న పరిస్థితి నెలకొంది. దిబ్బలు తడిచిపోవడం, రాశులు నానిపోవడం, పొలాల్లో వర్షపు నీరు చేరడం వంటి పరిస్థితులు ఆందోళనకరంగా తయారయ్యాయి. తేమ శాతం పేరుతో ఇబ్బందులు పడుతున్నారు. అమ్మే సమయంలో కాస్త ఎక్కువ తూకం ఇవ్వాల్సిన పరిస్థితులు చోటు చేసుకున్నాయి. ఇలాంటి పరిస్థితుల మధ్య అన్నదాతలు కన్నీరు మున్నీరు అవుతున్నారు.



రణస్థలం: వెల్పురాయిలో తడిచిన పంట పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు



చాపురంలో వరికుప్పపై టార్పాలిన్లు కప్పుతూ..

ఎమ్మెల్యే తనయుడి వాహనం ఢీకొని..

నలుగురికి తీవ్ర గాయాలు

- కొరసవాడ యాతపేట వద్ద ఆటోను ఢీకొన్న స్కార్పియో
- ఇద్దరి పరిస్థితి విషమం

పాతపట్నం: మండలంలోని కొరసవాడ యాతపేట సమీపంలో జాతీయ రహదారిపై పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తనయుడు సాయిగణేష్ ప్రయాణిస్తున్న స్కార్పియో వాహనం ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొన్న ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలు కాగా మరొకరు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతపట్నం శివశంకర్ కాలనీలో నివాసముంటున్న ఉపాధ్యాయుడు సింగ ఆనంద్ శనివారం మృతి చెందాడు. ఇతని కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలం లివిరి గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన చెప్పల బోగయ్య, సంతు, సవలాపురం నరేష్, గణేష్‌లు కలిసి ఆటో డ్రైవర్ కూర్మాన సునీల్‌తో కలిసి వచ్చారు. పరామర్శ అనంతరం స్వగ్రామం తిరిగి వెళ్తుండగా శనివారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో కొరసవాడ యాతపేట సమీపంలోని మలుపు వద్దకు వచ్చే సరికి ఎదురుగా పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తనయుడు మామిడి సాయి గణేష్ ప్రయాణిస్తున్న స్కార్పియో ఢీ కొట్టింది. ఆటో బోల్తాపడగా.. స్కార్పియో పక్కనే ఉన్న టేకు తోటలోకి దూసుకుపోయింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న నలుగురితో పాటు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే ఎమ్మెల్యే తనయుడు సాయిగణేష్, డ్రైవర్ రాజేష్‌లు అక్కడి నుంచి వెళ్లిపోయారు. సమాచారం అందుకున్న సీఐ వి.రామారావు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను అంబులెన్స్‌లో పాతపట్నం సీహెచ్‌సీకు తరలించారు. వైద్యులు మన్మధరావు, విక్రమ్, దేవిప్రసాద్‌లు ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్సకోసం అంబులెన్స్‌లో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. చెప్పల బోగయ్యకు, చెప్పల సంతుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రామారావు తెలిపారు.



క్షతగాత్రులను అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం



నుజ్జయిన ఆటో



తోటలోకి దూసుకుపోయిన స్కార్పియో

అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా శ్రీనివాసరావు



శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం మొదటి అదనపు జిల్లా జడ్జి కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కింజరాపు శ్రీనివాసరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన మూడేళ్ల పాటు సేవలందించనున్నారు. శ్రీనివాసరావు నియామకం పట్ల బార్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం హర్షం వ్యక్తం చేశారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసన



ఎచ్చెర్ల క్యాంపస్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం విద్యార్థులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. దేశానికి క్షమాపణలు చెప్పి మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు పి.రవికుమార్, ఎం.చిన్నసుబ్బారావు, వై.రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్రశిక్ష ఏపీసీగా శశిభూషణ్



డాక్టర్ సంపతిరావు శశిభూషణ్

శ్రీకాకుళం న్యూకాలనీ: సమగ్రశిక్ష ప్రాజెక్ట్ అదనపు ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ (ఏపీసీ)గా జిల్లాకు చెందిన డాక్టర్ సంపతిరావు శశిభూషణ్‌ను నియమిస్తూ పాఠశాల విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్ విభాగాధిపతిగా పనిచేస్తున్న ఆయన్ను ఫారిన్ సర్వీస్‌పై ఏపీసీగా నియమిస్తు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఈయన డిగ్రీ విద్యార్థులకు ఆరు సెమిస్టర్ పుస్తకాలను(ఇంగ్లిష్) తయారుచేసి, ఉత్తరాంధ్రాలో లక్షకుపైగా పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా శశిభూషణ్ మాట్లాడుతూ ప్రభుత్వ విధివిధానాలకు లోబడి కేజీబీవీల బలోపేతానికి కృషిచేస్తానని చెప్పారు.

29న తూర్పుకాపుల ఆత్మీయ కలయిక



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): రాష్ట్రంలో 30 లక్షల జనాభా కలిగిన తూర్పుకాపు సామాజికవర్గం శ్రీకాకుళం జిల్లా మహా సమ్మేళనం ఈ నెల 29న ఎచ్చెర్లలోని కేశవరెడ్డి స్కూల్ పక్కన స్థలంలో నిర్వహిస్తున్నట్లు సంఘ నాయకులు తెలిపారు. ఈ మేరకు నగరంలోని ఓ ప్రయివేటు కార్యాలయంలో ఆత్మీయ సమ్మేళనం పోస్టర్, కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మీయ కలయికకు ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో ఉన్న తూర్పు కాపు సామాజిక వర్గమంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా తూర్పు కాపు సంక్షేమ సంఘం ప్రతినిధులు సురంగి మోహనరావు, డోల జగన్‌మోహన్, శాసపు జోగినాయుడు, ఇజ్జాడ శ్రీనివాసరావు, లంక శ్యామసుందర్, కిల్లారి నారాయణరావు, డాక్టర్ ఎం.రామజోగినాయుడు, వాళ్ళ శ్రీరాములునాయుడు, పల్లి సురేష్, డోల బాలు, డాక్టర్ చందక రామకృష్ణ, మిర్తివాడ ప్రభాకర్, నేతల అప్పారావు, ఎం.శంకర్ నారాయణ, బొంతు విజయకృష్ణ, లోలుగు రవి తదితరులు పాల్గొన్నారు.

2.43 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి త్రినాథస్వామి, అధికారులు

జి.సిగడాం: జిల్లాలో ఇప్పటి వరకు 2 లక్షల 43 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి త్రినాథస్వామి తెలిపారు. శనివారం జి.సిగడాం మండలం ఆబోతులపేట, ఆనందపురం గ్రామాల్లో తడిచిన వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 3 లక్షల 60 వేల ఎకరాల్లో వరి సాగు చేయగా..3లక్షల 45 వేల మంది ఈకేవైసీ చేశామన్నారు. వీరి వద్ద నుంచి మాత్రమే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఓలు యర్రా శారద, బాబ్జి, సర్పంచ్ చిత్తిరి మోహన్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు ముంతా హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి



నిరసన తెలియజేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): కూటమి ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని, రాష్ట్రవ్యాప్తంగా రూ.3580 కోట్లు బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.నాగభూషణం, జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్.రవికుమార్ డిమాండ్ చేశారు. శనివారం శ్రీకాకుళం రామలక్ష్మణ కూడలిలో ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా విద్యా దీవెన, వసతి దీవెనలు (ఎంటీఎఫ్, ఆర్‌టీఎఫ్) చెల్లించడంలో అలసత్వం వహిస్తోందన్నారు. కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాయని చెప్పారు. విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం యాజమాన్యాల వద్ద ఏడు లక్షల మంది విద్యార్థుల సర్టిఫికెట్లు ఉన్నాయని చెప్పారు. ఉన్నత విద్యకు సంబంధించి జీవో 77పై కూటమి ప్రభుత్వం నోరు మెదపడం లేదన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు పూర్ణ, రాజు, ప్రవీణ్, రమేష్‌కుమార్, శ్రీను, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

కత్తులతో బెదిరించి దోపిడీకి యత్నం



గోవింద్ కుటుంబ సభ్యులను విచారిస్తున్న పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలో నిత్యం రద్దీగా ఉండే కిన్నెర కాంప్లెక్సు సమీపంలోని ఓ వ్యాపారవేత్త ఇంట్లో శనివారం రాత్రి దొంగలు చొరబడ్డారు. ముగ్గురు దుండగులు కత్తులతో బెదిరించి మరీ దోపిడీయత్నానికి పాల్పడ్డారు. ఒకటో పట్టణ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కిన్నెర కాంప్లెక్సు సమీపంలోని కాకివీధి పాయింట్ వద్ద వ్యాపారవేత్త కోరాడ గోవింద్ ఇంటి గేటు తీసుకుని ఇద్దరు, పెరడు నుంచి మరో దుండగుడు కాయగూరలు కోసే కత్తులతో చొరబడ్డారు. కుటుంబ సభ్యులను కత్తులతో బెదిరించారు. ఈలోగా గోవింద్ కుటుంబసభ్యులు ఇంట్లో ఉన్న కర్రలను, కత్తి పీటలను అందుకుని ప్రతిఘటించారు. వీరి కేకలు విని స్థానికులు రావడంతో దుండగులు పరారయ్యారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ సీహెచ్ వివేకానంద, ఒకటో పట్టణ సీఐ పైడపునాయుడు, క్లూస్ టీమ్ సిబ్బందితో చేరుకుని పరిసరాలను పరిశీలించారు. వ్యాపారంలో అంచెలంచెలుగా ఎదుగుతున్న గోవింద్ కుటుంబంపై కక్ష తీర్చుకునేందుకు వచ్చారా? లేక గోవింద్ ఇంటిపక్కనే హెచ్‌డీఎఫ్‌సీ ఏటీఎం ఉండటంతో అందులో చోరీకి వచ్చారా? అనే విషయంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పైడపునాయుడు పేర్కొన్నారు.

ముగిసిన క్రాస్‌కంట్రీ ఎంపిక పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో శనివారం క్రాస్‌కంట్రీ ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. స్టేట్‌మీట్ షెడ్యూల్ సమీపించడంతో తప్పనిసరి పరిస్థితిలో వర్షంలోనే ఎంపికలు నిర్వహించాల్సి వచ్చిందని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి తెలిపారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి



విద్యార్థికి డిగ్రీ పట్టాను అందజేస్తున్న అతిథులు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ రంజన్ బెనర్జీ

నెల్లిమర్ల రూరల్: అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని నయంత విశ్వ విద్యాలయం సీఈఓ ప్రొఫెసర్ రంజన్ బెనర్జీ పిలుపునిచ్చారు. విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో వర్సిటీ 4వ స్నాతకోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రంజన్ బెనర్జీ మాట్లాడుతూ అభిరుచులకు అనుగుణంగా కృషి చేసినప్పుడే గొప్ప విజయాలు సొంతమవుతాయన్నారు. సెంచూరియన్ వర్సిటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ ముక్తికాంత మిశ్రా, ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ డీఎన్‌రావు విద్యార్థులు సాధించిన విజయాలను ప్రశంసించారు. వర్సిటీ చాన్సలర్ జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ ప్రపంచ ప్రమాణాలతో నాణ్యమైన విద్యను అందిస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. వైస్ చాన్సలర్ ప్రశాంతకుమార్ మహంతి మాట్లాడుతూ వర్సిటీను వ్యాపారం కోసం స్థాపించబడలేదని, శక్తివంతమైన విద్యార్థులను సమాజానికి అందించేందుకు నిరంతర కృషి చేస్తున్నామన్నారు. అనంతరం 201 మంది విద్యార్థులకు డిగ్రీలు, మరో ఐదుగురు విద్యార్థులకు పీహెచ్‌డీలు, 16 మందికి బంగారు పతకాలు, 8 మందికి నగదు ప్రొత్సాహకాలను వక్తలు అందజేశారు. కార్యక్రమంలో భువనేశ్వర్ వర్సిటీ వీసీ సుప్రియా పట్నాయక్, రిజిస్ట్రార్ పల్లవి, పాలకమండలి సభ్యుడు, పారిశ్రామికవేత్త కుమార్ రాజా, డాక్టర్ పి.ఎస్.ఠాగూర్, ప్రొఫెసర్ కె.సి.బి.రావు, పీఎస్ఎస్‌వీ నరసింహం, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం సెమినార్ హాల్లో విద్యార్థులు శనివారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనా గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో వీసీ కె.ఆర్.రజిని రెక్టార్ బి.అడ్డయ్య పాల్గొన్నారు.



గీతాలు ఆలపిస్తున్న విద్యార్థులు

మాతా శిశు మరణాలు అరికట్టాలి



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

శ్రీకాకుళం పాతబస్టాండ్ : మాతా శిశు మరణాలు జరగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ వైద్యాధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మాతా మరణాలు నివారణపై వైద్యాధికారులతో శనివారం సమీక్షించారు. రక్త హీనత తలెత్తకుండా ముందుగానే గర్భిణులలో అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ బి.మీనాక్షి, డీసీహెచ్ఎస్ కళ్యాణ్ బాబు, డీపీఎన్‌హెచ్ఎన్ ఓ శైలజ, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి శాంతిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీలకు వర్సిటీ విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లోని కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ యూనివర్సిటీలో ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు జరిగే అఖిల భారత యోగా పోటీలకు అంబేడ్కర్ వర్సిటీ తరఫున క్రీడాకారులు హాజరవుతున్నారు. వీరిని వీసీ రజిని, రిజిస్ట్రార్ సుజాత, అధికారులు శనివారం అభినందించారు. మెరుగైన ప్రదర్శన కనబరచాలని కోరారు.



యోగా క్రీడాకారులతో వర్సిటీ అధికారులు